క్లుప్తంగా

సాయిబాబా మాలధారుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న సాయి స్వాములు

బిక్కవోలు: బలభద్రపురంలోని సాయిబాబా ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మాలధారణ చేసిన స్వాములు భిక్షాటన చేశారు. మాలధరించిన భక్తులు ఆదివారం, సోమవారం గ్రామంలోని భిక్షాటన చేయడం ద్వారా 4 క్వింటాళ్ల బియ్యం, రూ.72,000 నగదు లభించిందని, వాటితో 17న అన్నదానం చేయనున్నట్టు ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్తి సుబ్బారెడ్డి తెలిపారు.

16న విశ్వేశ్వరస్వామి కల్యాణం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి పాటి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అక్రమ బియ్యం పట్టివేత



పోలీస్‌స్టేషన్ వద్ద పీడీఎస్ బియ్యం వ్యాన్

బిక్కవోలు: ఆర్ఎస్ పేట బ్రిడ్జి వద్ద అక్రమంగా రవాణా అవుతున్న పీడీఎస్ బియ్యాన్ని ఎస్సై పి.బుజ్జిబాబు పట్టుకున్నారు. సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా నల్లమిల్లి నుంచి వ్యాన్ నుంచి 2,890కిలోల బియ్యం తరలిస్తుండడంతో ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకుని, బియ్యం లోడ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

635 మందికి వైద్యసేవలు

సీతానగరం: రఘుదేవపురం సచివాలయంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 635 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఇండుగుమిల్లి చంద్రలీల, ఎంపీటీసీ యలమాటి లలితా శిరీష ప్రారంభించారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, లక్ష్మి, ఎంఎల్ హెచ్‌వీ విజయ, ఏఎన్ఎం రమణ, ఆశ వర్కర్లు కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

కలవచర్లకు ఎల్ఐసీ నజరానా



లక్ష రూపాయల చెక్కును నజరానాగా అందజేస్తున్న బీఎం విద్యాసాగర్

రాజానగరం: జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) గోకవరం బ్రాంచ్ ద్వారా జరిగిన వ్యాపార, లావాదేవీలను అనుసరించి మండలంలోని కలవచర్లను 4వ పర్యాయం బీమా గ్రామంగా ప్రకటించి, రూ.లక్ష నజరానాగా అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి ఉపయోగించాల్సి ఉంటుంది. ఇందులో కీలకపాత్ర వహించిన ఏజెంట్ తర్రా వీరబాబును గోకవరం ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ విద్యాసాగర్, శాటిలైట్ సిటీ బ్రాంచ్ ఇన్‌చార్జి ఎంవీవీఎస్ రెడ్డి, ఏఓ ఎలిపే శ్రీనివాస్, డీఓ పప్పు దుర్గయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా రాజబాబు, పంచాయతీ సెక్రటరీ దొరబాబు, ఎల్ఐసీ ఏజెంట్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

సీతానగరం: ఇనుగంటివారిపేట సర్పంచ్ సత్యం శ్రీరామమూర్తి (రాంపండు) పుట్టిన రోజు సందర్భంగా సోమవారం జైరామ్, జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే 50 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కడవరి పెంతుకోస్తు ప్రార్థనా మందిరంలో సంజీవని వలంటరీ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 53 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్పంచ్ రాంపండు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో యల్లమిల్లి రాము, వీరబాబు, రాజు, ఎం.జస్వంత్, వై.వెంకటేష్, వై.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

లంకభూములపై జలఖడ్గం

- ఏటా కోతబారిన భూములు
- అనేక ఎకరాలు కనుమరుగు
- ఆందోళనలో రైతులు



బొబ్బిల్లంక వద్ద గోదావరి వరద కోతకు గురవుతున్న లంకభూమి

సీతానగరం: పంటలు పండించే లంక భూములు గోదావరి వరదలో కొట్టుకుపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతమైన రామచంద్రపురం, వంగలపూడి, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు చెందిన లంకభూములు గోదావరి కోతకు గురవుతున్నాయి. ప్రతి ఏడాది వచ్చే వరదల సమయంలో వందల ఎకరాల లంకభూమి కోతకు గురవుతోంది. ఏడేళ్ల క్రితం ముగ్గళ్ల, రఘుదేవపురం, ములకల్లంక, మునికూడలి లంకభూములు ఇలాగే కోత బారిన పడ్డాయి. గత ఏడాది గోదావరి వరద ఉధృతంగా రావడంతో ఇదే పరిస్థితి ఏర్పడింది. లంకభూములు కోతకు గురవ్వడంతో రైతుల జీవనం ప్రశ్నార్థకంగా మారింది. వ్యవసాయం చేయడానికి భూమి లేకపోతే ఏమిచేయాలో తెలియని స్థితిలో వారున్నారు. గోదావరి వరదలకు నాలుగేళ్లుగా సుమారు 400 ఎకరాల లంకభూమి కోతకు గురైంది. దీని నివారణకు చర్యలు తీసుకోవాలని గతంలో ఇరిగేషన్, అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారుల దృష్టికి రైతులు తీసుకెళ్లారు. కోతకు గురైన లంకభూములకు తామేమీ చేయలేమని, వరద వల్ల ఏటిగట్టుకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామే తప్ప, కోతకు గురైన లంక భూములకు ఎటువంటి నష్టపరిహారం కానీ, గోదావరి వరద నుంచి కాపాడడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేమని అధికారులు తేల్చిచెప్పారు.

రెండెకరాలు కోల్పోయా



గత ఏడాది వచ్చిన గోదావరి వరద సమయంలో రెండు ఎకరాల లంకభూమి కోతకు గురైంది. ప్రతి ఏడాదీ లంక భూములకు ఈ బాధ తప్పడం లేదు. అధికారులు స్పందించి, భూములు కోతకు గురవ్వకుండా రైతులకు అవగాహన కల్పించాలి.

– తిర్నాతి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, వంగలపూడి

అవగాహన కల్పించాలి



ఏటా బొబ్బిల్లంక లంకభూమి కోతకు గురవుతోంది. అలాగే ములకల్లంక గ్రామం కూడా వరద సమయంలో కోత బారిన పడుతోంది. ఇలా అయితే కొన్నేళ్ల తరువాత ఆ గ్రామం కనుమరుగవుతుంది. కోతకు గురవ్వకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

– బదుగు సురేంద్ర, బొబ్బిల్లంక

ప్రేమంటే ఇదేరా !



పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న గొన్నూరి లాజర్, సూర్యకుమారి దంపతులు

గోకవరం: గ్రామానికి చెందిన గొన్నూరి లాజర్, సూర్యకుమారి దంపతుల కులాలు వేరు. లాజర్ ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి కాగా సూర్యకుమారి వైశ్య కులానికి చెందిన వారు. వారిద్దరూ సుమారు మూడేళ్ల పాటు ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో పెళ్లికి ఇరువురి కుటుంబ పెద్దలు ఒప్పుకోలేదు. ఒకరి నొకరు విడిచి ఉండలేక పెద్దలను ఎదురించి మే 12, 2000 సంవత్సరంలో గుమ్మళ్లదొడ్డి సత్యనారాయణస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు సంతానం. వివాహమై 22 సంవత్సరాలు అయినప్పటికీ సూర్యకుమారి తరపు వారు ఇప్పటికీ కలవలేదు. లాజర్ పీఎంపీగా ప్రాక్టీసు చేస్తుండగా సూర్యకుమారి చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్‌గా పని చేస్తున్నారు. 22 ఏళ్ల ప్రేమ వివాహ దాంపత్య జీవితంలో అన్ని విషయాల్లోనూ ఒక్కటిగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

విద్యార్థులకు అభినందన



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రంగంపేట: ఈనెల 11వ తేదీన సింగంపల్లి గ్లోబల్ విజన్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ ముప్పిడి జాన్ డీన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల ఆటల పోటీల్లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు బహుమతులు దక్కించుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్ విభాగాల్లో తమ విద్యార్థులు సత్తా సాటారని తెలిపారు. విద్యార్థులను, పీడీ జి.హరికృష్ణ, పీఈటీ కె.చినబాబులను అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు

జీబీఆర్ విద్యార్థులు



విద్యార్థులతో జీబీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పీడీలు

అనపర్తి: అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టులో స్థానిక జీబీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏడుగురు విద్యార్థులు స్థానం దక్కించుకున్నట్టు డిగ్రీ కళాశాల పీడీ ఎంపీ రామారెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లాలో త్వరలో జరిగే అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో తూర్పుగోదావరి తరపున పాల్గొనే బాలబాలికల జట్ల ఎంపికలు స్థానిక ఎస్ఆర్‌జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో నిర్వహించారు. ఈ ఎంపికల్లో బాలికల విభాగంగా జీబీఆర్ విద్యార్థినులు డి.అనూష(ఇంటర్), టి.పుష్పజ్యోతి, కె.వాణి(డిగ్రీ), బాలుర విభాగంలో దుర్గాప్రసాద్(ఇంటర్), మనోహర్, టి.నవీన్, యస్.రాకేష్ (డిగ్రీ) ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ తేతలి కొండబాబు, పాలక మండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎన్‌పీ అబ్బాయి రెడ్డి, పీఆర్ఎల్ స్వామి, పీడీలు జయరాజు, కె.రాజులు అభినందించారు.

సంకల్పమే యువత ఆయుధం

- రామకృష్ణమఠం మేనేజర్ రఘువీరానందజీ
- జీబీఆర్‌లో జాతీయ యువజన దినోత్సవం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ముఖ్య అతిథులు

అనపర్తి: స్వామి వివేకానందుని బోధనల స్ఫూర్తితో యువత మనో సంకల్పాన్ని ఆయుధంగా చేసుకుని ముందుకుసాగాలని రాజమహేంద్రవరం రామకృష్ణమఠం మేనేజర్ స్వామి రఘువీరానందజీ మహారాజ్ అన్నారు. స్థానిక రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల సెమినార్ హాలులో జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్వామీజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సతిమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ మనిషి సమగ్ర జీవన విధానాన్ని నేర్పించిన స్వామీజీ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని, సమాజంలో యువత జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాలపై శ్రద్ధ తగ్గించి, వివేకనందుని భావజాలం ఆధారంగా చేసుకుని లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం స్వామి వివేకానంద సాహిత్యంపై వివేకపథం పేరిట నిర్వహించిన పోటీల పరీక్షల్లో ప్రతిభా కనబరిచిన 72 మంది విద్యార్థులకు, పరీక్షలు నిర్వహించిన 24 మంది అధ్యాపకులు, ఉపాధ్యాయులకు జ్ఞాపిక, స్వామీజీ సాహిత్యం, ప్రశంసాపత్రాలను అందజేశారు. మండల పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.ప్రియదర్శిని, పాతవూరు కేఏఆర్ హైస్కూల్ విద్యార్థిని జి.లక్ష్మీప్రసన్న, కుతుకులూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎస్.ధనకృష్ణారెడ్డిలకు స్వామి వివేకానంద సాహిత్య ప్రతిభా పురస్కారం పేరిట ఒక్కొక్కరికీ రూ.వెయ్యి నగదు, జ్ఞాపిక, స్వామీజీ సాహిత్యం, ప్రశంసాపత్రాలను అతిథుల చేతులమీదగా అందజేశారు. సమితి ఉపాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ తేతలి కృష్ణారెడ్డి, ఏపీఈపీడీసీఎల్ రిటైర్డ్ ఎస్ఈ చింతా సత్యనారాయణరెడ్డి, శ్రీచక్ర ఆయిల్స్ ఎండీ చింతా గోపాల కృష్ణారెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహర్షిరాఘవ, రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్, సమితి ఉపాధ్యక్షుడు సత్తి రామకృష్ణారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, సమితి సభ్యులు పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు



రంగంపేట స్పందనలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ అమ్మాజీ

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు వినతులు అందాయని తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. రంగంపేట గ్రామానికి చెందిన గుత్తుల సుబ్రహ్మణ్యం తనకు చెందిన భూమి ఏడీబీ రోడ్డు విస్తరణలో పోతుందని, దానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. కోటపాడు గ్రామ ఎంపీటీసీ సుంకర అప్పారావు తమ గ్రామంలో చనిపోయిన వారి పేర్లను రైస్ కార్డుల నుంచి తొలగించాలని, కోటపాడు గ్రామానికి చెందిన సుంకర వీరలక్ష్మి తమ రేషన్ కార్డులో తన భర్త పేరుకు బదులు తన కుమారుడి పేరు నమోదు చేయాలని ఫిర్యాదులు అందించారని ఆమె తెలిపారు.

సమస్యలపై అర్జీలు నిల్

రాజానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై ఏవిధమైన దరఖాస్తులు రాలేదని డిప్యూటీ తహసీల్దార్ సునీత తెలిపారు.

పరీక్షలంటే భయపడటం మానేయాలి

కంబాలచెరువు: విద్యార్థి దశలో పరీక్షలు అత్యంత ప్రాముఖ్యమైనవని, వాటిని ఉత్సాహంగా ఎదుర్కోవాలే తప్ప భయపడి ఒత్తిడి తెచ్చుకోవద్దని డైట్ ప్రిన్సిపాల్ నూజిళ్ల రామసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక చున్నీలాల్‌జాజు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'పరీక్ష పర్వ్ 4.0' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్' సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఈ కార్యక్రమం రూపొందించారన్నారు.

విద్యార్థులకు అవగాహన

జిల్లా స్థాయిలో ఉన్న డైట్ కళాశాలలు వీలును బట్టి కనీసం పది పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. పరీక్ష పర్వ్ 4.0 ద్వారా ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని వివిధ పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని సబ్జెక్టులను ఎప్పటి కప్పుడు చదువుకుంటూ ఒక ప్రణాళిక ప్రకారం పరీక్షలకు హాజరైతే ఎటువంటి ఒత్తిడి ఉండదన్నారు. మారుతున్న పరీక్షా విధానాలను ముందుగానే అవగాహన చేసుకోవడం, మాదిరి ప్రశ్నపత్రాలను పూరించడం ద్వారా సబ్జెక్టుపై సందేహాలు తొలగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు కేవీ మునీశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



పెదపూడి రైసు మిల్లులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెదపూడి: వెట్టిచాకిరి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పెదపూడి ఎస్సై పి.వాసు తెలిపారు. ఆయన మండలంలో 18 గ్రామాల్లో షాపులు, రైసు మిల్లులు, వివిధ పరిశ్రమలు, హోటళ్ల తదితర వాటిలో వెట్టిచాకిరి, బాలిక కార్మిక నిర్మూలన వ్యవస్థపై అవగాహన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పరిశ్రమలు, షాపుల్లో చిన్నారులతో వెట్టిచాకిరి చేయిస్తే వారిపై నిబంధనలు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 14 సంవత్సరాల్లోపు చిన్నారులతో పనులు చేయిస్తే వారిని బాలిక కార్మికులుగా గుర్తించి, వారిని పనిలో పెట్టుకున్న వారిపై తగిన చర్యలు చేపడతారన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్టకొండ లక్ష్మీనరసింహుని

హుండీ ఆదాయం రూ. 1,25,018



ఆదాయం లెక్కింపు ప్రారంభిస్తున్న ఈఓ రమణమూర్తి తదితరులు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక హుండీ ఆదాయం రూ.1,25,018 వచ్చిందని ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. ఆలయంలో స్వామి వారి హుండీ ఆదాయం లెక్కింపు దేవదాయ ధర్మదాయశాఖ కాకినాడ ఇన్‌స్పెక్టర్ ఫణి పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ గతేడాది మార్చి 10 నుంచి నేటి వరకూ గల హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించామన్నారు.

గతేడాది కంటే ఆదాయం పెరిగినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెదపూడి గ్రూప్ ఆలయాల ఈఓ వడ్డాది సత్యనారాయణ, గ్రామ సర్పంచి వల్లు వెంకటరమణ, ఉపసర్పంచి ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జి.మామిడాడలో వైద్య పరీక్షలు



జి.మామిడాడలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో 3 వేల మందికి మధుమేహ నిర్ధారణ వైద్య పరీక్షలు చేయాలనేదే లక్ష్యంతో సోమవారం ఇంటింటికీ తిరిగి పరీక్షలు చేస్తున్నట్టు స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షల చేశారు. సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వారి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అయిన డయాబెటిక్ అవగాహన, నియంత్రణ, నివారణ ప్రాజెక్టులో భాగంగా లయన్స్ క్లబ్ శ్రీ సూర్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధి సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, క్లబ్ మెంటర్ మండ రాజారెడ్డి, సభ్యులు పప్పు రామకృష్ణారెడ్డి, కడిమి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

శభాష్ కృష్ణమూర్తి

- దివాన్‌చెరువు యువకుడి సేవానిరతి
- పేదలకు ఆహారం వితరణ



లాలాచెరువు రిజర్వు ఫారెస్టు వద్ద కోతులకు ఆహారాన్ని అందిస్తున్న కృష్ణమూర్తి

రాజానగరం: సేవ చేయాలనే మనసుంటే మార్గాలెన్నో ఉంటాయంటారు పెద్దలు. యర్రంశెట్టి కృష్ణమూర్తి అనే దివాన్‌చెరువుకు చెందిన ఈ యువకుడిని చూస్తుంటే నిజమేననిపిస్తుంది. డిగ్రీ వరకు చదువుకున్న ఈ యువకుడు జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. గృహిణి అయిన భార్య, 9, 7వ తరగతి చదువుతున్న ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. చిన్న జీతంతోనే సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు. సొంతలాభం కొంతమానుకుని, పొరుగువారికి సాయపడవోయ్ అన్న గురజాడ మాటలను స్ఫూర్తిగా తీసుకుని వారంలో ఒకటి, రెండు రోజులు అన్నార్తుల ఆకలి తీర్చే ప్రయత్నం చేస్తున్నాడు.

కరోన సమయం నుంచి..

కరోనా సమయంలో చాలామంది కూలీలు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతుంటేవాళ్లు. ఆకలి వేస్తే తీర్చుకునేందుకు అవకాశం కూడా ఉండేది కాదు. ఆ సమయంలో వారికి ఎంతో కొంత సాయం అందించాలనే సంకల్పంతో భోజనాలు పెట్టడం ప్రారంభించానని కృష్ణమూర్తి 'సాక్షి'కి తెలిపారు. ప్రతి శని, సోమవారాలలో ఇంటి వద్దనే స్వయంగా తయారుచేసుకుని తన బైకుపై తీసుకువెళ్లి రాజమహేంద్రవరంలో వృద్ధులకు, వికలాంగులకు ఆహారాన్ని పొట్లాలు కట్టి అందిస్తుంటాడు. దారి మధ్యలో లాలాచెరువు రిజర్వు ఫారెస్టు ఏరియాలో ఉన్న వానరాలకు కూడా ఆకలి తీర్చే ప్రయత్నం చేస్తుంటాడు.

ఏపీత్రయంలో గ్రామస్తుల ఆందోళన

పెదపూడి: ఏపీత్రయం గ్రామంలో సోమవారం రాత్రి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కరప మండలంలోని అరట్లకట్ట బొంబాయి చెరువులో మట్టిని లారీలపై కాకినాడ తరలిస్తున్నారు. గ్రామంలో కాకినాడ వైపు నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న పి.గోపాలకృష్ణ(కిట్టయ్య)పై వేగంగా వెళుతున్న లారీ నుంచి మట్టి పెళ్లలు జారి పడ్డాయి. దీంతో అతడికి లారీ డ్రైవర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. గోపాలకృష్ణ కుటుంబ సభ్యులతో సహా గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై పి.వాసు సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆందోళన విరమించాలని కోరారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, గ్రామస్తులకు మధ్య కూడా వాగ్వాదం జరిగింది. దీంతో ఎస్సైను సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు చేరుకున్నారు. కొంతసేపటికి ఉద్రిక్తత సద్దుమణిగింది.

రాజేష్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

ధవళేశ్వరం: ఇటీవల హత్యకు గురైన అండిబోయిన రాజేష్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి సోమవారం రూ. 50 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన ప్రభుత్వ పరంగా సాయం అందజేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. నిందితులకు శిక్ష పడేవిధంగా చూస్తానన్నారు. గొందేశి పూర్ణచంద్రా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పిన్నింటి ఏకబాబు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి శ్రీనివాసులురెడ్డి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సంఘటనను శ్రీనివాసులు రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన శెట్టిబలిజ సంఘ నాయకుడు కేతా నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేతా సాయి, పెచ్చెటి శ్రీనివాసరావు, దొమ్మేటి సత్యనారాయణ, పట్నాల జువ్వాలు, ఆళ్ళ ఆనందరావు, పేర్ల దుర్గాప్రసాద్,పాల్గొన్నారు.